కథ

# రాళ్ళ నెక్లెస్

– వలివేటి నాగచంద్రావతి

క్యాషియర్ చేతికందించిన మూడు వంద రూపాయల కట్టల్ని మృదువుగా తడిమేరు పరంధామయ్య గారు. ఎంతో తృప్తి... మరెంతో ఆనందం. ఆ అనుభూతి ఎవరెస్ట్ శిఖరం మీద త్రివర్ణ పతాకాన్ని నాటబోతున్న టెన్సింగ్ నార్కేలోనూ తొలిసారి చంద్ర మండలంపై అడుగు మోపబోతున్న నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ లోనూ కలిగిన అనుభూతికంటే తక్కువైనదేమీ కాదు.

నోట్ల కట్టల్ని జిప్‌బేగ్‌లో భద్రపరచి బ్యాంకు బయటకు వచ్చారు. ఇక డ్రా చేసిన పైకంతో చేయ దలచిన కార్యం నెరవేర్చాల్సి ఉంది. బస్టాండు వైపుగా అడుగులు వేశారు. బస్సు రద్దీగా లేదు. కిటికీపక్క సీటు కూడా దొరికింది. బస్సు బయలుదేరాక కిటికీ అద్దాన్ని పక్కకి జరిపారు. చల్లటి గాలి తోసుకుంటూ వచ్చి ముఖాన్ని తాకుతూ పలకరించింది. ప్రయాణంలో రివ్వుమంటూ ఎదురొచ్చే గాలిని ఆస్వాదించటం ఆయనకెంతో ఇష్టం.


'ఈరోజు ప్రతీదీ నాకు నచ్చేవిధంగానే జరుగుతోంది స్మీ' అని సంతోషపడ్డారు. 'తన చిరకాల వాంఛ... ఇన్నాళ్ళకి... కాదు కాదు... ఇన్నేళ్ళకి నెరవేరబోతోందనటానికివన్నీ సంకేతాలు' అని కూడా అనుకున్నారాయన నమ్మకంగా.

అటూ ఇటూ కదిలి కుదురుగా కూర్చుంటూ కిటికీ బయటకు చూశారు. పైరగాలికి తలలూపుతున్న వరిచేలూ పచ్చని పూలతో విరబూసి నవ్వుతున్న ఆవమొక్కలూ గెలలు దింపి హుందాగా నిలబడ్డ అరటిచెట్లూ తన కూతురు వసంతలక్ష్మి పసితనాన్నీ కన్నెతనాన్నీ తల్లితనాన్నీ గుర్తుకుతెచ్చాయి.

కూతుర్ని తలచుకోగానే ఆయనలో ఓ మైమరపు... చుట్టుముట్టిన ఓ భ్రాంతి. "నాన్నా, నాకా యశోద వేసుకున్నలాంటి నెక్లెస్ చేయించవా? " కూతురు వసంత గొంతు అది.

"ఓస్, అంతేనా తల్లీ! ఇదిగో డబ్బు... అంతకన్నా మంచి నెక్లెస్ చేయించుకో" భరోసాగా లాలిస్తూ ఆ స్వరం తనదే.

తిరిగి ప్రస్తుతంలోకి వచ్చేశారాయన.



తరచూ తనని కుదుపుతూ పలకరించే ఊహే ఇది. అవును... నిన్నటివరకూ అది పగటికలే. ఈరోజు నిజం కాబోతున్న స్వప్నం. కానీ ఆ కల సాకారమవ్వటానికి ఎంత తపనపడ్డాడు... ఎన్నేళ్ళు నిరీక్షించాడు. ఎన్ని ప్రయత్నాలు... ఎన్ని అవరోధాలు... ఎన్ని ఆశాభంగాలు... రెప్పలు అరమూసి వెనక్కి వాలారాయన.

మూసిన రెప్పల వెనుక గతం గళం విప్పింది.

★ ★ ★

"నాన్నా, నాన్నా" అప్పుడే ఆఫీసు నుంచి వచ్చి విశ్రాంతిగా పడక్కుర్చీలో వాలిన పరంధామయ్య గారి కాళ్ళను చుట్టేసుకుంది చిట్టి వసంత.

పరిగెత్తుకొచ్చిన కూతుర్ని దగ్గరకు తీసుకుంటూ "ఏమిట్రా తల్లీ? " అన్నారు ముద్దుగా. కొడుకు గోపీకృష్ణ కంటే తల్లిపేరు పెట్టుకున్న వసంతంటే పిచ్చి ప్రేమ ఆయనకు.

"నాన్నా, ఆ యశోద పెట్టుకున్న లాంటి నెక్లెస్ నాకూ చేయించవూ" గారాబంగా అడుగుతోన్న వసంత కళ్ళలో అభ్యర్థన, ఆశ- తండ్రి స్థోమత తెలీని పసితనం.

గతుక్కుమన్నారు పరంధామయ్య గారు. నమ్మకం చాలనట్టు "ఏం కావాలన్నావు" మళ్ళీ అడిగారు.

"అదే నాన్నా, ఇందాక ఆ అన్నపూర్ణ ఆంటీ ఇంటికి బొమ్మల హారతి పేరంటానికి వెళ్ళామా... అక్కడికి పెట్టుకొచ్చింది యశోద. ఎంత బావుందో. దాన్లో రాళ్ళు తళుక్ తళుక్‌మంటూ నక్షత్రాల్లా మెరిసిపోతున్నాయనుకో" ఉత్సాహంగా చెబుతోన్న వసంత కళ్ళు కూడా అలాగే కొత్త అద్దాల్లా తళతళలాడాయి.

"అవునా!" విషయం అర్థమయీ అవనట్టు అయోమయంగా అన్నారు పరంధామయ్య గారు.

"అవున్నాన్నా నిజం. మరీ... అది నేను వేసుకుంటే బావుండదూ? "

"ఎందుకు బావుండదూ" పచ్చగా పుత్తడి ఛాయలో మెరుస్తున్న కూతురి మెడనీ ఆ మెళ్ళో ఎర్రటి పట్టుతాడుకి వేలాడుతున్న ఆంజనేయ స్వామి రాగిబిళ్ళనీ చూస్తూ... ఆ స్థానే రాళ్ళు పొదిగిన బంగారు నెక్లెస్‌ని ఊహించుకుంటూ "బంగారుతల్లిలా ఉంటావు" అన్నారు మురిపెంగా.

"అయితే నాకూ అలాంటి నెక్లెస్ చేయిస్తావుగా? "

"తప్పకుండా చేయిస్తారా తల్లీ".

తండ్రి 'ఊ' అనటమే చాలు, తన కోరిక తీరినట్టుగా భావించటం వసంత అమాయకత్వం. 'ఎప్పటికెయ్యది ప్రస్తుతమో' అప్పటికా మాటలాడి సమస్యని దాటవేసే మధ్యతరగతి మనస్తత్వం పరంధామయ్య గారిది.

ఏదో చిన్నపిల్ల. సరేననేస్తే అదే మరచిపోతుంది లెమ్మనుకున్నారుగానీ అక్కడితో ఆ గండం గడిచిపోలేదు. వసంత రెండ్రోజులకోసారన్నా నెక్లెస్ సంగతి తండ్రికి గుర్తుచేస్తూనే ఉంది.

అందుకు ముఖ్య కారకురాలు యశోద. "మీ నాన్నింకా నెక్లెస్ కొనలేదేం అంటోంది నాన్నా- యశోద".

"మీ నాన్నవన్నీ అబద్ధాలే. నువ్వేడుస్తావని ఉత్తుత్తి మాయమాటలు చెప్పాడంతే- అని వెక్కిరిస్తోంది నాన్నా".

"మీ నాన్నింకా నెక్లెస్సే చేయించలేదు. మా నాన్న గాజులు కూడా చేయిస్తున్నాడు- అని గొప్పలుపోతోంది నాన్నా యశోద". ఇలా యశోద తనని రెచ్చగొడుతూ అన్నవన్నీ తండ్రి దగ్గర ఒప్పగించేసి- "నువ్వు చప్పున నెక్లెస్ కొనిచ్చెయ్. దాని తిక్క కుదిరిపోతుంది. కొంటావుగా? " అని తండ్రిని హెచ్చరించి, ఆశగా చూసేది వసంత.

ఇరుకున పడిపోయేవారు పరంధామయ్య గారు. ఈ ఇబ్బంది చాలనట్టు ఓరోజు జుట్టు చెరిగి, బట్టలు నలిగి ఏడుస్తూ ఇంటికొచ్చింది వసంత.

తోటకూరకాడలా వేలాడుతూ వచ్చిన కూతుర్ని చూసేసరికి గుండె జారినట్టయింది తల్లి రుక్మిణికి.

"ఏమయిందే? " అన్నది గాభరాగా.

సమాధానంగా తల్లి ఒళ్ళో దూరి భోరుమన్నది వసంత.

"లీజర్లో వసంత, యశోద కొట్లాడుకున్నారు ఆంటీ. యశోద- వసంత జుట్టు పీకింది. వసంత- యశోద చెయ్యి కొరికింది. టీచరు గారికి కోపమొచ్చి ఇద్దర్నీ కొట్టారు" సమాచారమందించింది పక్కింటి సీత.

ఆఫీసునించొచ్చి అప్పుడే పంపు దగ్గర కాళ్ళు కడుక్కుంటున్నారు పరంధామయ్య గారు.

"ఇద్దరూ మంచి స్నేహితులే గదా! పోట్లాటెందుకొచ్చిందీ మీకు? " అడిగారు విస్మయంగా.

"నీ మూలాన్నే" సివంగిలా తలెత్తింది వసంత.

"అదేవిటే? " బుగ్గన వేలేసుకుంది తల్లి.

"మరి... రేపూ మాపూ అనకుండా ఆ నెక్లెస్ కొనిపెట్టుంటే మాకు పోట్లాట వచ్చేదే కాదు కదా? "

"దానికీ దీనికీ ఏమిటే సంబంధం? "

"అట్లా ఆలస్యం చేయబట్టే ఆ యశోద నాన్నని అన్ని మాటలంది. నాన్నకేమీ చాతకాదట, వట్టి అబద్ధాలకోరట. నాకు ఎప్పటికీ నెక్లెస్ చేయించలేట్ట. మహా అయితే ఇంకో పట్టుతాడూ ఓ వెండి వెంకటేశ్వరస్వామి బిళ్ళా చేయిస్తాట్ట. ఏంటేంటో వాగింది, నవ్వింది. నాకు కోపమొచ్చి తిట్టాను. అది నా జుట్టు పీకింది. నేను దాని చెయ్యి కొరికాను. టీచరు మా ఇద్దర్నీ కొట్టారు" కంట్లోంచి కారే నీళ్ళని తుడుచుకుంటూ తిరిగి తల్లి ఒళ్ళో దూరిపోయి, "ఇప్పుడైనా నాన్నని నెక్లెస్ కొని తెమ్మనమ్మా. అది నేను పెట్టుకువెడితేగానీ దాని తిక్క కుదరదు" అంది వసంత ఏడుపు గొంతుకతో.

తప్పుచేసి పట్టుబడినట్టు చిన్నబోయిన మొహాన్ని పక్కకు తిప్పుకున్నారు పరంధామయ్య గారు.

చిన్నగా నవ్వుకుంది రుక్మిణి. ఆవిడకు ఆ తండ్రీ కూతుళ్ళ మధ్య ఉన్న బంధం తల్లీ కొడుకుల

అనుబంధమని తెలుసు. ఆ కూతురి మాటని కాదనలేక నలిబిలయ్యే భర్త బలహీనతా తెలుసు. అలాటి సమయాల్లో తన అవసరమెంతో కూడా ఆవిడకు బాగానే తెలుసు.

ఒళ్లో వాలిన కూతురి తలను వాత్సల్యంగా మృదువుగా నిమురుస్తూ, చేదుమందుకి తేనె కలిపి తినిపిస్తున్నట్టు కొన్ని కటిక నిజాల్ని పదేళ్ల కూతురికి అర్థమయ్యే రీతిలో నిదానంగా చెప్పింది రుక్మిణి.

"యశోద చెప్పింది నిజమేరా తల్లీ. ఆ నెక్లెస్ కొనాలంటే చాలా డబ్బుండాలి. చాలా అంటే నాన్న మూడునెలల జీతం అంతన్నమాట. నీకు నెక్లెస్ కొంటే మనం మూడు నెలలపాటు అన్నం మానేయాలన్నమాట. అంచేతే నాన్న నీకా నెక్లెస్ కొనలేకపోయారు".

"మరి, యశోద నాన్నెలా కొన్నాడు" తలెత్తి అడిగింది వసంత.

"వాళ్ళు మనలా కాదు. వాళ్ళకి చాలా డబ్బుంది".

"మనకెందుకు లేదు- వాళ్ళకెందుకుంది? "

"దేవుడు మనకివ్వలేదు. వాళ్ళకిచ్చాడు" రుక్మిణి నిట్టూర్పు.

"వాళ్ళకే ఎందుకు ఇచ్చేడు? "

సమాధానానికి కొంచెం సమయం తీసుకుంది రుక్మిణి. "ఎందుకంటే దేవుడు తన దగ్గరున్నవన్నీ అందరికీ పంచుతుంటాడు. ఆయనైనా అందరికీ అన్నీ ఇవ్వలేడుగా. ఆ పంపకంలో వాళ్ళకి డబ్బిచ్చేడన్నమాట".

"మరి మనకేమిచ్చేడు? "

"బంగారుతల్లివి- నిన్ను మాకిచ్చేడు. నీకు పనస తొనలాంటి ఛాయనిచ్చేడు... పువ్వు లాంటి అందమిచ్చేడు... తేనె లాంటి బుద్ధినిచ్చేడు. పాపం యశోదకివన్నీ లేవు కదా? అంచేత వాళ్ళ నాన్నచేత నెక్లెస్ ఇప్పించేడు. భగవంతుడు మనకిచ్చిన దాంతో తృప్తిపడాలి. లేనిదానికోసం వెంపర్లాడకూడదు. ఇవ్వాలనుకుంటే ఎప్పుడో ఒకప్పుడు దేవుడే నీకా నెక్లెస్ ఇప్పించేస్తాడు. అర్థమయింది కదా. ఇక నువ్వా నెక్లెస్ కోసం పట్టుపట్టకూడదు- సరేనా".

తల్లి చెప్పిన ఈ వేదాంతంలో ఏ విషయం అర్థమై, ఏది కాలేదో కానీ తండ్రి తనకా నెక్లెస్ కొనివ్వలేదన్నది మాత్రం స్పష్టంగా అర్థమైంది వసంతకి.

సరేనన్నట్టుగా బుర్ర ఊపిందేగానీ ఆ పసిమనసు ఈ ఆశాభంగానికి తట్టుకోలేకపోయింది. ఇప్పటిదాకా ఈవేళ కాకపోతే రేపయినా తండ్రి ఆ నగ కొనిపెడతాడనే నమ్మకముండేది. తల్లి ఇప్పుడు ఆ నమ్మకాన్ని కూకటివేళ్ళతో పెళ్ళగించడంతో ఆ చిన్ని ప్రాణం తీవ్రంగానే గాయపడింది.

ఆ రాత్రి వసంతకి ఒళ్ళు పేలిపోతూ జ్వరం ముంచుకొచ్చేసింది. తెల్లవార్లూ మంచం పక్కనే తల్లీ తండ్రీ జాగారం చేశారు. వసంత ఒకటే కలవరింతలు. 'యశోద... నెక్లెస్... నాన్నా' అంటూ.

పరంధామయ్య గారికి కన్నీళ్ళాగలేదు. 'శుష్క వాగ్దానాలొద్దు' అన్నట్టుగా భార్య వారిస్తున్నా ఆగలేక, "తల్లీ నీకు నెక్లెస్ తప్పకుండా కొంటానమ్మా. నన్ను నమ్ము" అంటూ కూతురి చెంప నిమురుస్తూ గద్గద కంఠంతో మాట ఇచ్చారు మళ్ళీ.

వసంత కళ్ళు తెరిచింది. ఆ కళ్ళలో అపనమ్మకమూ అంతలోనే ఓ చిరుదీపపు వెలుగూ దోబూచులాటలు.

అప్పుడే పరంధామయ్య గారు గట్టిగా నిర్ణయించుకున్నారు. ఎప్పటికైనా ఎలాగైనా వసంతకి నెక్లెస్ కొనిపెట్టి తీరాలని.

★ ★ ★

తెల్లవారేసరికల్లా వసంత జ్వరం తగ్గిపోయింది. దినసరి కార్యక్రమాల్లో పడిపోయింది. తల్లి చేసిన బ్రెయిన్ వాష్ మూలాన్నో ఏమోకానీ తిరిగి తండ్రి దగ్గర నెక్లెస్ ప్రస్తావన తీసుకురాలేదు. టీచరు భయం మూలంగా యశోద కూడా మళ్ళీ ఆ నెక్లెస్ సంగతి ఎత్తలేదు.

అలా వసంత కోరిక మరపునపడింది కానీ మాసిపోలేదు. తన ఈడు పిల్లల్లో ఎవరి మెడ తళుకులీనినా చిటారుకొమ్మన మిఠాయి పొట్లాన్ని చూసినట్టు చూస్తూ, చివుక్కుమన్న మనస్సుతో తల తిప్పుకునేది.

కూతుర్నలా మూగగా చూడ్డం పరంధామయ్య గారికి చాలా బాధగా ఉండేది. నెక్లెస్ కొని తీరాలన్న నిశ్చయం మరింత దృఢతరమయ్యేది.

అప్పట్నించీ ఇప్పటివరకూ ఆయనకు చేతనయిన ప్రయత్నాలు ఆయన చేస్తూనే ఉన్నారు. 'కొద్దికొద్దిగా కూడబెడితేసరి. ఒక్కొక్క రాయీ వెయ్యగా వెయ్యగా అదే గుట్ట అవుతుంది' అనుకున్నారు ఆశగా.

కూడబెట్టాలని అనుకున్నారేగానీ అదంత సులభమా? తెచ్చే అత్తెసరు జీతం నెలసరి ఖర్చులకే బొటాబొటీగా సరిపోయె. దాన్లో మిగల్చాలంటే ఎన్ని త్యాగాలు చెయ్యాలి?

పాపం ఇంట్లో పాలు తగ్గించేశారు. కాఫీ మానేశారు. అప్పుడప్పుడూ కాలక్షేపంగా నోట్లో వేసుకునే వక్కపొడి పొట్లం కూడా కొనటం మానేశారు. వారానికి సరిపడా కూరలు తెచ్చి, పదిహేను రోజులు సర్దమని భార్యని నసపెట్టేవారు. అద్దె తగ్గుతుందని ఆఫీసుకు దూరంగా, ఊరికి ఓ చివరున్న పేటకి కాపురం మార్చేశారు. నెల మధ్యలో సరుకులైపోయాయని భార్య కానీ... ఏ పెన్సిలో కొనాలని కొడుకు కానీ అడిగారంటే ఇంతెత్తున ఎగిరిపడేవారు.

'ఇదెక్కడి విడ్డూరమమ్మా. కూతురు దేవలోకం పారిజాతం కావాలనటం బావుంది. ఈ తండ్రి ఆకాశానికి నిచ్చెన వెయ్యటం అంతకన్నా బావుంది. మధ్యన మాకొచ్చాయి తిప్పలు' అని రుక్మిణి విసుక్కున్నా లెక్క చెయ్యలేదు. రూపాయి రూపాయి పోగవుతున్నందుకు సంతోషమే కలిగింది పరంధామయ్య గారికి.

ఇన్ని అగచాట్లుపడినా ప్రాప్తం లేకపోతే కాలే కడుపు కోసం అరువు తెచ్చుకున్న సంకటి, అనుకోని అతిథులొచ్చి ఆరగించి పోయారన్నట్టుగా అయ్యేది.

ఒకసారి పల్లెటూర్లో ఉంటున్న ఆయన ముసలితల్లి పరమపదించటం వల్ల కర్మకాండలకు ఖర్చు చేయాల్సి వచ్చింది. ఒకసారి రుక్మిణికి కంటి ఆపరేషన్ చేయించాల్సి వచ్చింది. మరోసారి గోపీకృష్ణని కాలేజీలో చేర్పించే టైము. పుస్తకాలూ దుస్తులూ అంటూ చాలా డబ్బయిపోయింది. ఇంకోసారి ఇంకో అవసరం. మరోసారి మరొకటి. ఇంతే నిరంతరాయంగా ఊరే సమస్యలు ఊరుతూనే ఉన్నాయి. కూతురి కోరిక తీర్చాలనుకున్న ఆయన కోరిక తీరటమే లేదు. వారాలూ నెలలూ సంవత్సరాలూ దొర్లిపోతున్నాయి.

"నీ అప్పు ఎప్పుడు తీరుస్తానో ఏమిటోరా తల్లీ" అనేవారు నవ్వుతూ వసంతతో. 'నీ నెక్లెస్ సంగతి నేను మరిచిపోలేదు సుమీ' అన్నట్టుగా.

"పో నాన్నా, నువ్వు నాకు అప్పుండటమేమిటి? " అనేది వసంత తానూ నవ్వేస్తూ.



వసంత వ్యక్తురాలయింది. ఆ అమ్మాయికిప్పుడు లోకంలోని ఆర్థిక అసమానతలూ తెలుసు, తమ ఆర్థిక స్థితీ తెలుసు. తండ్రి పడే ఆరాటమూ కష్టమూ తెలుసు.

మనసుపడింది మనసులోనే దాచుకునే కూతురంటే మరీ మక్కువ పరంధామయ్య గారికి. అందుకే పరిస్థితులు విసురుతున్న సవాళ్ళకు ఎప్పటికప్పుడు తలవంచుతున్నా రాబోయే కాలం మంచిది కాకపోతుందా అని ముందుకు చూడ్డం మాత్రం మానుకోలేదాయన.

★ ★ ★

గోపీకృష్ణ చదువు పూర్తిచేసుకుని బ్యాంకులో ఉద్యోగం సంపాయించుకున్నాడు. కొడుకు సంపాదనపరుడవటం పరంధామయ్య గారికి కొండంత బలాన్నిచ్చింది. ఇన్నాళ్ళూ ఒంటిరెక్క మీద లాక్కొచ్చిన సంసార రథానికి ఇంకో రెండు చేతులు ఊతమిస్తాయన్న ఆలోచనే ఏనుగెక్కించినంత ఉత్సాహాన్నిస్తోంది.

ఆయన ఎదురు చూసినట్టుగానే ఆరు నెలలపాటు తన ఖర్చులు పోనూ మిగతా జీతమంతా ఠంచనుగా ఇంటికి ఎం.ఓ. చేశాడు గోపీకృష్ణ. ఆరోనెల్లో మనియార్డరుతోపాటు ఓ ఉత్తరం కూడా పంపాడు.

"నాన్నా, భువనేశ్వరి నాతోపాటే ఈ బ్యాంకులో జాయినయింది. చాలా మంచి అమ్మాయి. మేమిద్దరం ఒకరినొకరం ఇష్టపడ్డాం. మీ అంగీకారంతో ఒకటికావాలని కోరుకుంటున్నాం. దయచేసి భువన పెద్దలతో మాట్లాడండి. మీ అందరి ఆశీర్వాదాలతో మా వివాహం జరగాలని ఆశపడుతున్నాం." అందులో సారాంశమది.

వద్దనటం, బెదిరించటం, పొమ్మనటం పాత పద్ధతి. వాళ్ళ అభీష్టాన్ని ఆమోదించటం, కిమ్మనకుండా ఆశీర్వదించటం, అక్షింతలు వేసి పెద్దరికం నిలుపుకోవటం ఇప్పటి పద్ధతి. పరంధామయ్య గారూ అదే చేశారు. పెళ్ళికి ముహూర్తాలు పెట్టించారు.

పెళ్ళికి అవసరమైన బట్టలూ అవీ తీసుకోడానికి గోపీకృష్ణ ఇంటికి వచ్చాడు. వస్తూ భువనని కూడా వెంటబెట్టుకు వచ్చాడు. భువన కలుపుగోలు పిల్లే. అరమరికలు లేకుండా మాట్లాడుతుంది. అందరం కలిసే షాపింగ్ చేద్దాం అంది. రుక్మిణిని కూడా బయలుదేరదీసేదాకా వదల్లేదు. ముందు బట్టలషాపు పని ముగించుకుని జ్యూయలరీ షాపుకి వెళ్ళారు.

భువనకి నగల విషయంలో అనుభవమున్నట్టే ఉంది. కెంపులూ పచ్చలూ ముత్యాలూ అంటూ ఏవేవో సెట్లు తీయించింది. అరవంకీలూ గాజులూ పరిశీలించింది. ఎంచుకున్నవి పక్కన పెట్టింది. మొత్తానికి చాలా ఆభరణాలే ఖరీదు చేసింది.

పరంధామయ్య గారు యథాలాపంగా కూతుర్ని చూశారు. 'బాగా ఆకలిగా ఉన్నవాణ్ణి నోరు కట్టేసి



మిఠాయి అంగడిలో కూర్చోపెట్టినట్టుగా ఉంది పాపం దీని పని' అనిపించిందాయనకి.

గోపీకృష్ణని పక్కకి పిలిచారు పరంధామయ్య గారు. "వసంతకి ఎప్పట్నించో ముచ్చట- నెక్లెస్ పెట్టుకోవాలని. పనిలో పని, దానికది కొనిపెడదామా?" అన్నారు తటపటాయిస్తూనే.

గోపీకృష్ణ ఒక్కక్షణం తండ్రి మొహంకేసి అదోలా చూశాడు. "నాన్నా, భువనకివన్నీ నేను కొంటున్నాననుకుంటున్నారా? లేదు, మీకు తెలీని డబ్బు నా దగ్గరెక్కడుంది? నేను కట్నం వద్దన్నానని వాళ్ళ నాన్న తనని నగలు కొనుక్కోమన్నారట" అన్నాడు అనుమానాన్ని నివృత్తి చేస్తున్నట్టు.

"అబ్బెబ్బే" నొచ్చుకున్నారు పరంధామయ్య గారు. "నేనా ఉద్దేశంతో అడగలేదురా. పెళ్ళీడుకొచ్చిన పిల్ల కదా... దాని మెళ్ళోనూ ఓ నగ ఉంటే బాగుంటుంది. ఖర్చులో ఖర్చు... కనిపించదు గదా అని అన్నానంతే" అన్నారు చాలా బాధపడుతూ.

"నాన్నా ఈ పెళ్ళి ఖర్చులకే కొంత అప్పుచేశాం. ఇక వసంతకి నెక్లెస్ కూడా అంటే, తడిసి మోపెడవుతుంది. నువ్వే ఆలోచించు. పెళ్ళి కావాల్సిన పిల్ల అని నువ్వే అన్నావ్. ముందు ఆ విషయానికి ప్రాధాన్యమిద్దాం. ఇప్పుడు నెక్లెస్ ముఖ్యం కాదు. దాని పెళ్ళిలో చేయించొచ్చు" అన్నాడు గోపీకృష్ణ తండ్రికి నచ్చజెప్పే ధోరణిలో.

రుక్మిణి కూడా కొడుకునే సమర్థించింది. "బాగా చెప్పేవు. పిల్లని ఓ అయ్య చేతిలో పెట్టే యోచన చెయ్యక, ఈయనకా నెక్లెస్ పిచ్చేమిటో అర్థంకాదు" అంది నొసలు చిట్లించి.

అప్పుడా ప్రయత్నమలా నీరుకారిపోయింది.

అయితే అన్నట్టుగానే గోపీకృష్ణ ప్రోత్సాహంతో వసంత కోసం వరుని వేట ఆరంభించి ఆ మరుసటి సంవత్సరం పెళ్ళి కూడా జరిపించేశారు.

గోపీకృష్ణ బాధ్యత తెలిసిన కొడుకనిపించాడు. పెళ్ళి పనులు యావత్తూ భుజాన వేసుకోవటమేకాక పెళ్ళి ఖర్చులోనూ వియ్యాలవారడిగిన కట్నకానుకల ఖర్చులోనూ తండ్రికి బాసటగా నిలబడ్డాడు.

ఏ తండ్రయినా కూతురిపెళ్ళి ప్రయాసపడకుండా అయినందుకు మహదానందపడతాడు. కానీ పరంధామయ్య గారు మాత్రం అసంతృప్తిగానే ఉన్నారు. కారణం- ఇంకేముందీ- ఆ నెక్లెసే.

నిశ్చయ తాంబూలం తీసుకునే రోజునే వరుడి తల్లిని అడిగారు- "అక్కగారూ! వరుడికి కానుకగా లక్ష రూపాయలడిగారు. సరేనన్నాం. మా అమ్మాయికి రాళ్ళ నెక్లెస్ పెట్టుకోవాలని ఎప్పట్నించో మనసు. మీ కానుకగా కోడలికి నెక్లెస్ చేయించండి" అని.

"అవునవును" గోపీకృష్ణ వంత పలికాడు.

వరుడి తల్లి రాధమ్మ గారు వినయంగానే అయినా, కచ్చితంగా ఆ ప్రతిపాదనని తిరస్కరించింది.

"మీరా నగ అడగడంలో న్యాయం ఉంది అన్నగారూ! కానీ కిందటేడు అమ్మాయి పెళ్ళి చేశాం. లక్ష రూపాయలు అప్పు అయింది. అప్పంటే చేతికి చుట్టుకున్న పామే కదా! ఆ బాధనించి బయటపడ్డానికే కుందన బొమ్మలాంటి మీ అమ్మాయిని కోడలిగా పంపుతానంటే కళ్ళకద్దుకోవాల్సింది పోయి, కట్నమడగాల్సి వచ్చింది. మీరిచ్చింది అప్పుకి వెళ్ళిపోతుంది. మీరా నగ తప్పదన్నారంటే మళ్ళీ అప్పు చెయ్యాల్సిందే. మీ అమ్మాయి అడుగుపెట్టబోయే ఇల్లు రుణ భారంతో ఉండటం మీకిష్టమయితే చెప్పండి, అలానే చేయిస్తాను" అంది.

ఇక నోరెత్తే వీలెక్కడుంది?

పెళ్ళిరోజు గౌరీపూజ చేస్తున్న వసంత దగ్గరకొచ్చి సన్నటి బంగారు గొలుసొకటి చేతిలో పెట్టింది రాధమ్మ. "చూడు వసంతా, మనం మధ్యతరగతి జీవులం. మనసుపడ్డవన్నీ సొంతంచేసుకోవాలనుకోవడం అసంభవమే కాదు, అవివేకం కూడా. ప్రాప్తించినదాన్ని చిన్నచూపు చూడకుండా స్వీకరించటమే వివేకం. ఏమో అదృష్టం బావుంటే ఆ మనసూ తీరవచ్చు. నిరాశపడకుండా ఆ మంచిరోజుకోసం ఎదురుచూద్దాం" అంది అనునయంగా.

'మీ నిరీక్షణలతో నాకేం పని' అంటూ కాలం ముందుకు పరుగుపెట్టింది.

పరంధామయ్య గారి ఉద్యోగకాలం ముగిసింది. రిటైరయ్యారు. విశ్రాంతితోపాటు ఇన్నేళ్ళు కూడబెట్టుకున్న శ్రమ ఫలితం కూడా చేతికందింది.

పి.ఎఫ్. డబ్బు బ్యాంకులో జమ అయినట్టు తెలియగానే మొట్టమొదట పరంధామయ్యగారనుకున్నది 'ముందు వసంతకి నెక్లెస్ చేయించాలి. ఇక వాయిదా వెయ్యకూడదు' అని. అనుకోవటమే తడవుగా బ్యాంకులో డబ్బు డ్రా చేశారు. వసంత దగ్గరకు బయలుదేరారు.

పాపం వసంత. ఇప్పటికీ ఆ పసుపుతాడే, ఆ నేత చీరే. అయినా మోహన చిరునవ్వు చెరగనీయదు. పిచ్చితల్లి. ఇప్పుడు హఠాత్తుగా వెళ్ళి నెక్లెస్ కొనుక్కోమని డబ్బు చేతిలోపెడితే ఎంత సంతోషిస్తుందో.

బస్సు ఆగింది. పరంధామయ్య గారి తలపోతలూ ఆగాయి.

★ ★ ★

తలుపు తీసిన వసంత తండ్రిని చూసి నిజంగానే సంభ్రమంతో తలమునకలయ్యింది.

"రండి నాన్నా" చేతిలో సంచి అందుకుంటూ ఆప్యాయంగా ఆహ్వానించింది.

కుశలప్రశ్నలూ కాఫీ ఫలహారాలూ అయ్యాక తండ్రికి దగ్గరగా వచ్చి కూర్చుంది వసంత.

కొడుకు సిద్ధూ చదువులో చూపిస్తున్న చురుకుతనమూ రెండు రూపాయలిచ్చినా జాగ్రత్తగా దాచుకునే వాడి పొదుపరితనమూ చిన్నవాడైనా పరిస్థితుల్ని ఆకళించుకోగలిగే వాడి పెద్దబుద్ధీ...గురించి చెబుతూ ఉప్పొంగిపోతున్న కూతుర్ని అభిమానంగా చూస్తూ జిప్ తెరిచి డబ్బు తీసి వసంత చేతిలో పెట్టారు పరంధామయ్య గారు.

"ఏమిటిది నాన్నా?" అడిగింది వసంత విస్మయం ముంచెత్తిన కంఠంతో.

"నా కల తల్లీ!" అన్నారు పరంధామయ్య గారు.

అర్థమయింది వసంతకి. "నాన్నా" అంటూ తండ్రి ఒళ్ళో తల వాల్చింది- అచ్చం చిన్నప్పటిలానే. ఒడిలో వాలిన కూతురి తలపై చేయి ఉంచి మనసంతా కమ్మదనం నిండిన అనుభూతి చెందారు పరంధామయ్య.

"పద తల్లీ, చప్పున తయారవ్వు. బజారు వెళదాం. నీకు నచ్చిన మోడల్ కొనుక్కుందువుగాని" అన్నారు మృదువుగా.

తలెత్తి తండ్రిని చూసింది వసంత. "మీరొద్దులెండి నాన్నా, ప్రయాణం చేసి వచ్చారు, అలిసి ఉంటారు. ఇంట్లో ఉండి-విశ్రాంతి తీసుకోండి. అత్తమ్మ కూడా ఒక్కరే ఉన్నారు ఇంట్లో. ఒంటిగంటకి సిద్ధూ వస్తాడు. ఇద్దరం వెడతాం" అంది.

అలసటగా ఉన్నమాట నిజమే. పరంధామయ్య గారు సరేనన్నారు.

అన్నట్టుగానే ఆయన ఓ కునుకుతీసి లేచేవేళకు బజారుకెళ్ళిన కూతురూ మనవడూ తిరిగి వచ్చారు. కానీ ఆయన అనుకున్నట్టు చేతి సంచీలో వెల్వెట్ బాక్స్‌తోకాదు, పెద్దపెద్ద అట్టపెట్టెలు మోసుకుంటూ వచ్చారు. ఆయనలా కళ్ళు విప్పార్చి చూస్తూ ఉండగానే పెట్టెల్లో తెచ్చిన వస్తువుల్ని టేబుల్ పైన అమర్చేశారు. కూడా వచ్చిన డిమానిస్ట్రేటరు ఆపరేట్ చేసే విధానం సిద్ధూకి చెప్పేసి వెళ్ళిపోయాడు.

అయోమయంలో ఉన్న పరంధామయ్య గారితో "తాతయ్యా! కంప్యూటర్ కొనుక్కొచ్చా చూడు, దీన్ని ఎలా ఆపరేట్ చేయాలో తెలుసా నీకు? రా, చూపిస్తాను. ఇది కీబోర్డు... ఈ చిన్నిది చూశావా- ఇది మౌసు. దీన్ని కదుపుతూ నొక్కుకుంటూపోతే ఎన్‌సైక్లోపీడియా బుక్ పేజీలు తిప్పుతున్నట్టు మనకేది కావాలంటే అది, ఒకటి తరవాత ఒకటిగా విండోస్ ఎలా ఓపెనవుతున్నాయో చూశావా? నాకిదంటే ఎంతో ఇష్టం. నీకు తెలుసా తాతయ్యా, మా స్కూల్లో ఎల్‌కేజీ నించే కంప్యూటర్ నేర్పిస్తారు. ప్రతి ఏడాదీ కంప్యూటర్ క్లాసులో నాదే ఫస్టుమార్కు. పెద్దయ్యాక నేను గొప్ప సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ని అవుతాను తాతయ్యా. కంప్యూటర్ ఇంట్లో ఉంటే బాగా ప్రాక్టీస్ చేసుకోవచ్చు, మెదడుకు పదును పెట్టుకోవచ్చు అని మా టీచరు ఎప్పుడూ చెబుతుంటారు. అమ్మని కంప్యూటర్ కొనిమ్మని ఎప్పుడో అడిగాను. పాపం, అమ్మా నాన్నా దగ్గర అంత డబ్బెక్కడుంది? అమ్మా నేనూ దీనికోసం డిబ్బీలో డబ్బులు కూడా దాస్తున్నాం. కానీ అది ఎన్నిసార్లు నింపితే ఇది కొనటానికి సరిపోతుంది చెప్పు. నువ్వు అంత డబ్బు ఇవ్వబట్టి అమ్మ నాకిది కొనిపెట్టింది. థాంక్యూ తాతయ్యా, థాంక్యూ" పట్టరాని ఆనందం కళ్ళనుండి ఉబుకుతోంటే తాతగారి చేతులు ఊపుతూ కృతజ్ఞతలు తెలియజేశాడు సిద్ధూ.

"నాన్నా" అన్న పిలుపుతో పక్కకి చూశారు పరంధామయ్య గారు. కొడుకు ముఖంలోని సంబరాన్ని మెరుస్తోన్న కళ్ళతో వీక్షిస్తోంది వసంత.

"ఇది నా కల నాన్నా" అంది స్వప్నంలో పలవరిస్తున్నట్టు. "ఇంటర్‌కి రాబోతున్నాడు నాన్నా సిద్ధూ. వాడికి కంప్యూటరంటే ప్రాణం. వాడి కోర్కె తీర్చాలని మీలాగే నాకూ ఎంతో ఆశ. మీ దయవల్ల అదును తప్పకుండా నా కల నిజం చేసుకున్నాను. నన్ను క్షమిస్తారు కదూ!" వెలుగుతోన్న కూతురి కళ్ళలో తనని తాను చూసుకుంటున్న పరంధామయ్య గారికి ఆ మాటలేవీ వినిపించటం లేదు. ★